విధుల్లో అలసత్వం తగదు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విధుల్లో అలసత్వం తగదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బల్దియా అధికారులతో కలిసి టోలిచౌకీలో ఆదివారం పర్యటించారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద మురుగు నీరు చేరడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈఈ వెంకటశేషయ్య, మజ్లిస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా కల్యాణం


పాల్గొన్న ఆలయ చైర్మన్ సాయిసచిన్ తదితరులు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ ఎన్ఎండీసీ ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవీ.సురేందర్, డీ నాగరాజ్, రవికుమార్, సుజాత, విజయ, శ్రీదేవి, జాగృతి, భువనకృతి, శ్రీను, ఆర్.అమర్నాథ్, తివారి ఇంద్రేష్, శర్మ, ఆశీస్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు


జాహెద్ చేసిన పోలీసు లోగోను చూస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

గోల్కొండ: దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని గోల్కొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ సాలేనగర్‌కు చెందిన దివ్యాంగ టైలర్, ఫ్యాషన్ డిజైనర్ మహ్మద్ జాహెద్ రూపొందించిన పోలీసు లోగోను ఆదివారం ఆయన ఆవిష్కరించారు.

నియామకం


నియామక పత్రం అందుకున్న మోహన్‌గౌడ్

జియాగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా కె.మోహన్ గౌడ్ నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. వెనుకబడిన కులాలవారికి సీఎం రూ. 1000 కోట్ల సబ్ ప్లాన్, 53 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కూడా ఎక్కువ శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళాకృష్ణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందకం దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రజాప్రతినిధులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ కుమార్తె మేఘన వివాహం అరుణ్‌కుమార్‌తో ఆదివారం జరిగింది. పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమల పట్టివేత

గౌలిపురా: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమలను మొఘల్‌పురా పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురా షకూర్ మహమ్మద్ మసీద్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ముజఫర్ (28) స్థానికంగా రేషన్ బియ్యాన్ని రూ.12లకు కొనుగోలు చేసి రూ.15లకు, గోధుమలను రూ.10లకు కొనుగోలు చేసి రూ.13లకు విక్రయిస్తుంటాడు. కొనుగోలు చేసిన రేషన్ బియ్యం, గోధుమలను తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ దావూద్ వాహనంలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటాడు. తమకు అందిన సమాచారం మేరకు శనివారం సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ సీఐ అరుణ ఆధ్వర్యంలో బృందం అబ్దుల్ ముజఫర్‌ను అరెస్ట్ చేసి 10.63 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 2.25 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకుని వాటిని యాకుత్‌పురా సర్కిల్ ఇన్‌చార్జి ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మరో నిందితుడు, వాహన యజమాని షేక్ దావూద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డంతా గుంతలమయం..!

జియాగూడ: పురానాపూల్ నుంచి గిరికపల్లి, రాంసింగ్‌పురా మొగల్‌కానాలాకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ లేదా బీటీ రోడ్డుగా మార్చాలని బస్తీలవాసులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న గిరికపల్లి నుంచి రింగ్‌రోడ్డు రహదారి

హైవే విస్తరణ జరిగేనా..?

గోషామహల్ నుంచి మెహిదీపట్నం వరకు ఇరుకుగా పాత ముంబై రోడ్డు

- పనుల ప్రతిపాదనలకు నోచుకోని వైనం
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు
- మరోవైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

పాత ముంబాయి హైవే రోడ్డు విస్తరణ పనులు అటకెక్కాయి. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై పనుల ప్రతిపాదన కూడా లేకపోవడంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల కొద్ది ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఫలితంగా ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో సమస్య మరింత జఠిలం అవుతోంది. ఈ రూట్‌లో రాకపోకలు సాగించే వారు ట్రాఫిక్‌లో చిక్కుకుని సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత ట్రాఫిక్ పోలీసు వారు పట్టించుకోవడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు.

నాంపల్లి


మల్లేపల్లి జెటికేఫ్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

గోషామహల్ నుంచి మెహిదీపట్నం వరకు..

గోషామహల్ పెట్రోల్ బంక్ నుంచి పాత ముంబై హైవే ప్రారంభవుతుంది. ఈ రహదారి దారుస్సలాం, బోయిగూడ కమాన్, సీతారామ్‌బాగ్, జెటికేఫ్, నోబుల్ టాకీస్ చౌరస్తా, ఆసిఫ్‌నగర్ మీదుగా మెహిదీపట్నం వద్ద ముగుస్తుంది. ఈ మధ్యలో రోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. ఎప్పుడో చేపట్టాల్సిన ఈ రహదారి విస్తరణ పనులు ఆలస్యం అవుతూ వస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేయాల్సిన ఇండ్లకు నోటీసులు కూడా జారీ చేసి కొందరికీ నష్టపరిహారాన్ని చెల్లించారు. కానీ ఉన్నపళంగా రహదారి విస్తరణ ప్రక్రియ ఆగిపోవడంతో ఎందుకు నిలిచిపోయాయనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై తాత్సారం..

సీతారామ్‌బాగ్ ఫ్రెండ్స్ కేఫ్ నుంచి నోబుల్ టాకీస్ చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలు ఉన్నాయి. వాటిని తొలగించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నెలకు ఒక్కసారి క్రేన్లతో దర్శనమిచ్చే జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది మళ్లీ నెల వరకు కనిపించడం లేదు. ట్రాఫిక్ సమస్యపై ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే చలాన్లు వేసి చేతులు దులుపుకుంటున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి..



ఈ రూట్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. కొన్నేళ్లుగా రోడ్డు విస్తరణ పనుల ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. త్వరగా చేపడితే పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు తప్పుతాయి. –ఎం.రాందాస్, స్థానికుడు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణతోనే సమస్య..



పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. దీంతో పాదచారులు రోడ్డు గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై వాహనాల రద్దీతో ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి.. ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయాలి. –భరత్, విద్యార్థి సంఘం నేత

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోటలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. పర్యాటకులు కోట గోడలు, భారీ ఫిరంగులు, ఆయుధాగారంలోని కుతుబ్‌షాహీరాజుల కాలం నాటి వాటిని ఫొటోలు తీసకున్నారు. కోట భారీ ఫిరంగి వద్ద యువ జంటలు సెల్ఫీలు దిగారు.


గోల్కొండ కోటలో పర్యాటకులు

సర్టిఫికెట్ అందజేత


సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అబిడ్స్: ఉత్తమ సేవలు అందించిన నాంపల్లి మండల తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌కు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కమాండేషన్ సర్టిఫికెట్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్‌ను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం


గౌరీ సతీశ్

గన్‌ఫౌండ్రీ: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా దగా చేసిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం.. రైతులకు రుణమాఫీ చేసి హామీ నిలబెట్టుకున్నామన్నారు.

సీఎస్‌ఏ సంస్థకు జాతీయ స్థాయి అవార్డు


ఎక్స్‌లెన్స్ అవార్డు స్వీకరిస్తున్న సీఎస్‌ఏ బోర్డు డైరెక్టర్లు

నాంపల్లి: అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్ సంస్థ (ఏఎంపీ) యేటా అందజేసే నేషనల్ అవార్డు ఫర్ సోషియల్ ఎక్స్‌లెన్స్ –2024లో భాగంగా నగరానికి చెందిన సివిల్ సర్వీసెస్ అకాడమి (సీఎస్ఏ)కు ఛేంజ్ మేకర్ ఆఫ్ ద అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం మీడియా ప్లస్ ఆడిటోరియంలో ఏఎంపీ సంస్థ ప్రతినిధి ఫారూఖీ సిద్దిఖీ చేతుల మీదుగా సీఎస్ఏ బోర్డు డైరెక్టర్స్ కరీం ఇర్ఫాన్, అబ్దుల్ ఖదీర్, లాసెట్ కన్వీనర్ బషీర్ అహ్మద్ ఛేంజ్ మేకర్ అవార్డును స్వీకరించారు. తమ సంస్థ చేసిన సేవలకు జాతీయ స్థాయి అవార్డు లభించడం సంతోషంగా ఉందని బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల కోసం ఇప్పటివరకు 350 సెమినార్లు, వెబ్‌నార్లు నిర్వహించామన్నారు. లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన 300 మంది విద్యార్థులు మొదటి బ్యాచ్‌ను పూర్తి చేసుకున్నట్లు వివరించారు. అలాగే యూపీఎస్సీ, లాసెట్ కోసం విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో కోచింగ్ అందజేస్తున్నట్లు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ సూచించారు. టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో గచ్చిబౌలి, దర్గా, షేక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలతో ఆదివారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలు, మహిళా శక్తి పథకాలు ప్రత్యేకంగా మహిళల కోసమే ప్రవేశపెట్టారని బ్యాంక్‌లో ఖాతాలు తీసి పొదుపు సంఘాన్ని ప్రారంభిస్తే వారికి ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్నారు. మహిళలు సంపాదనపరులైతే వారి కుటుంబాలు కూడా మరింత ఆర్థికంగా బలపడతాయని అన్నారు.

పబ్‌ల్లో ఎక్సైజ్ పోలీసుల విస్తృత తనిఖీలు

బంజారాహిల్స్: ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పబ్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు 36 డౌన్ టౌన్, ఫోర్గ్, క్వోరా, అమ్నేషియా, గ్రీస్ మంకీ, తబులా రస, స్టోన్ వాటర్స్, ప్రోస్ట్, బేబీలోన్ తదితర 12 పబ్‌ల్లో ఈ తనిఖీలు జరిగాయి. ప్రధానంగా ఈ తనిఖీల్లో డ్రగ్స్ వాడకం, డ్రగ్స్ సంబంధిత నేరాలపై దృష్టిపెట్టారు. అనుమానితులపై స్పాట్ డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో పరీక్షలు చేశారు. డ్రగ్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను మార్చేందుకు రెగ్యులర్‌గా ఈ తనిఖీలు కొనసాగుతాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. పబ్ నిర్వాహకులు కస్టమర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలని, పబ్ సిబ్బంది ఎవరైనా డ్రగ్ సంబంధిత నేరాలకు పాల్పడితే ఆ పబ్ లైసెన్స్ రద్దు చేయబడుతుందని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ సీఐ వాసుదేవరావు పబ్ యజమానులకు సూచించారు. నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. డ్రగ్స్ సంబంధిత నేరాలపై సమాచారం ఉండే పౌరులు 8712659638 నెంబర్‌కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కెమెరాలు అద్దెకు తీసుకుని...

తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: కెమెరాలు అద్దెకు తీసుకుని తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కల్యాణ్‌నగర్‌కు చెందిన రాజాఅన్వేష్ ఎల్లారెడ్డిగూడలో కెమెరాలను కిరాయికి తిప్పుతుంటాడు. గత నెల 28న కుషాయిగూడకు చెందిన నందగిరి నరేందర్, ఎస్.ఉమేశ్ ఎల్లారెడ్డిగూడలోని రాజా అన్వేష్ షాపునకు వచ్చి రూ.2.50 లక్షల విలువైన కెమెరాలు, లెన్స్‌లు, బ్యాటరీలు, చార్జర్లు తీసుకెళ్లారు. ఆ సమయంలో రోజుకు రూ.1500 కిరాయి చెల్లిస్తామని చెప్పారు. తొలిరోజు అద్దె ఇచ్చిన వారు తర్వాత 3 రోజులైనా పంపలేదు. నరేందర్‌ను ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. దీంతో బాధితుడు నరేందర్ ఆధార్‌కార్డును కెమెరా అసోసియేషన్ గ్రూప్‌లో పెట్టి విషయాన్ని తెలియజేశాడు. ఈ నెల 1న ఆనంద్ నుంచి నరేందర్ కెమెరాలు, లెన్స్ అద్దెకు తీసుకున్నాడు. 17వ తేదీన నరేందర్ మళ్లీ మోహముక్తార్ షాపునకు వెళ్లి కెమెరాలు అద్దెకు కావాలని అడిగాడు. దీంతో అప్పటికే వాట్సాప్ గ్రూప్‌లో అతని ఆధార్‌కార్డు వివరాలను చూసిన ముక్తార్ వెంటనే రాజా అన్వేష్‌కు విషయాన్ని తెలిపి నరేందర్‌ను పట్టుకుని మధురానగర్ పీఎస్‌కు తీసుకువచ్చాడు. నిందితుడిపై అన్వేష్, ముక్తార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపులపై దాడులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లోని అంబేడ్కర్ కాలనీ, సీబీఐ కాలనీ బస్తీల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇద్దరు అక్రమంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో దాడులు చేసి అంబేడ్కర్ కాలనీబస్తీకి చెందిన కొమ్ము శేఖర్ వద్ద 113 మద్యం సీసాలు, సీబీఐ కాలనీలోని కర్రయ్య వద్ద 115 వివిధ రకాల మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి


దీపాదాస్‌కి విన్నవిస్తున్న వినోద్, రాజేందర్ యాదవ్

నాంపల్లి: పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాశం రాజేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఆదివారం కలిసి విన్నవించారు. కష్టకాలంలో పార్టీని వీడకుండా పనిచేసిన వారెందరో ఉన్నారని, వారిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో గొల్లపల్లి దయానందరావు, డాక్టర్ నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

సుల్తాన్‌బజార్: బీసీ సాధికారత భవన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నీరగొండ బుచ్చన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాయల నర్సయ్య, చంద్రగిరి సత్యనారాయణ, టీఎస్.స్వామి, ఔషాదం రవీందర్, కర్నె రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా దొంబర దివాకర్, తల్వారే రమేశ్ మాంగ్, మార శంకర్ మాల మాస్టిన్, సీహెచ్ వెంకటయ్య, మాదసి కురువ, కోశాధికారిగా ఉపదే సానధన్ మాంగ్ గారోడి, రాష్ట్ర కార్యదర్శులుగా హర్షపాక శ్రీనివాస్ మాదిగ దాసు, దాసరి నాగరాజు మాల దాసరి, ప్రచార కార్యదర్శులుగా గడ్డం యాదగిరి, శాఖమూరి యాదగిరి, సాంస్కృతిక కార్యదర్శులుగా నాగిళ్ల కృష్ణయ్య మాస్టిస్, డాకూరి లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో 57 ఉపకులాల పోరాట సమితి నాయకులు, కుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి ఎదుట వైద్య సిబ్బంది నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సుల్తాన్‌బజార్: కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ ఏరియాసుపత్రిలో డాక్టర్స్, ఫార్మసీ, నర్సింగ్, పారామెడికల్, సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ సిబ్బంది ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరేశ్ బాబు మాట్లాడుతూ.. నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతి ఏరియాసుపత్రికి పోలీస్ ఔట్ పోస్ట్ మంజూరు చేయాలని అలాగే వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ రూబి జాక్సన్, సాయికిరణ్, లక్ష్మీప్రియ, వెంకట శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

నిందితులను ఉరి తీయాలి

గోల్కొండ: కోల్‌కతా ఘటన నిందితులను వెంటనే ఉరి తీయాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ డిమాండ్ చేశారు. ఆదివారం 'హాంగ్ ది రేపిస్ట్' అనే ప్లకార్డులతో గోల్కొండ రిసాల బజార్ నుంచి డెక్కన్ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఫహాద్, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

పూజలు, అన్నదానం

అఫ్జల్‌గంజ్: గౌలిగూడలోని జై భవానీ ఆలయంలో ఆదివారం శ్రావణమాస పూజలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీజేపీ జీహెచ్ఎంసీ పక్షనేత గౌంటి శంకర్‌యాదవ్ నేతృత్వంలో జెల్లా మోహన్‌దాస్ యాదవ్, బాల నరేందర్, కిషన్, ఎం.గణేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులను స్థానికులు శాలువాలు, పూలమాలతో సత్కరించారు.


అన్నదానంలో మోహన్‌దాస్‌యాదవ్ ప్రతినిధులు

మార్కెట్లకు రక్షాబంధన్ శోభ


హనుమాన్‌నగర్‌లో విక్రయిస్తున్న రాఖీలు

గౌలిపురా/యాకుత్‌పురా: రక్షాబంధన్ వేడుకల నేపథ్యంలో మార్కెట్లు సందడిగా మారాయి. అంబికానగర్, హనుమాన్‌నగర్, గౌలిపురా, యాకుత్‌పురా బ్రహ్మణ్‌వాడీ, అలీజాకోట్ల, హరిబౌలీ తదితర మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆదివారం రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి. వీటితో పాటు స్వీట్ షాపుల్లోనూ ప్రజలు మిఠాయిలు కొనుగోలు చేశారు.


స్వీట్ దుకాణంలో వినియోగదారులు..


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


ఎమ్మెల్సీ కోదండరాంను సత్కరించిన ఆదిల్ షరీఫ్

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్, జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్ యాదవ్, ఎన్.రమేశ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.